ప్రజాశక్తి

మంగళవారం 17 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ఎస్పీ కార్యాలయం వద్ద

ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నం

- రొయ్యల చెరువు భూమిని అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నారని ఆవేదన
- విచారణకు ఆదేశించిన ఎస్పి

బాధిత కుటుంబం..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తమకు చెందిన ఎకరం రొయ్యల చెరువు భూమిని అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ నిజాంపట్నం మండలం, హరిస్‌పేటకు చెందిన కోపనాతి శ్రీనివాసరావు తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఎస్పి కార్యాలయం బయట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడ ఉన్న పోలీసులు అడ్డుకొని భాదిత కుటుంబాన్ని ఎస్పీ తుషార్ డూడి ఎదురు హాజరుపరిచారు.

బాధితుడు శ్రీనివాసరావు కథనం ప్రకారం.. శ్రీనివాసరావు హరిస్‌పేట గ్రామం లో రొయ్యల చెరువులను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి చెందిన రొయ్యల చెరువుల పక్కనే మోపిదేవి పోతురాజు అనే రైతుకు చెందిన చెరువులు ఉన్నాయి. శ్రీనివాసరావు పోతురాజు వద్ద గతంలో రూ.3 లక్షల నగదు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బుకు వడ్డీలకు వడ్డీలు వేసి ఎక్కువ మొత్తం అప్పు ఉన్నట్లు పోతురాజు చెబుతూ వచ్చారు. కొద్దిరోజుల క్రితం పోతురాజు తాను వేరొకరి పొలం కొన్నానని, సాక్షి సంతకం చేద్దువురా.. అని తీసుకెళ్లి.. శ్రీనివాసరావుకు చెందిన రెండు ఎకరాల్లో ఒక ఎకరం తన పేరున రిజిస్టర్ చేసుకున్నాడు. దాన్ని తిరిగి ▶ 2లో

కొద్దికొద్దిగానే..!

- నాణ్యమైన నల్లబర్లీ పొగాకును స్వల్పంగానే కొంటున్న కంపెనీలు
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు వాయిదా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రప్రభుత్వం మొట్టమొదటిసారిగా మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు చేయనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లా పరిధిలో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయనున్నారు. పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, చీరాల, మద్దిపాడు యార్డుల ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు చేపట్టనున్నారు. పర్చూరు మార్కెట్ యార్డులో మంగళవారం నల్లబర్లీ పొగాకు కొనుగోలును అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినా.. అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం కంపెనీలు నాణ్యమైన నల్లబర్లీని కొద్ది కొద్దిగానే కొంటున్నాయి. దీని వల్ల రైతుల్లో ఆందోళన ఇంకా వీడలేదు.

ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల, రైతుల సంయుక్త సమావేశంలో గత సమావేశాల్లో జరిగిన నిర్ణయాల మేరకు నల్లబర్లీ పొగాకును ఐటీసీ, జీపీఐ సంస్థలు కలిపి 25 మిలియన్ కిలోలు, చిన్న కంపెనీలు 20 మిలియన్ కిలోల చొప్పున కొనాల్సి ఉంది. సదరు కంపెనీలు కొనగా రైతుల వద్ద మిగిలి ఉన్న నల్లబర్లీని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనుంది. నల్లబర్లీ పొగాకు మొదటి గ్రేడ్‌ను క్వింటాలుకు రూ.12 వేలకు తగ్గకుండా, రెండో గ్రేడ్‌ను రూ.6 వేలు చొప్పున కొనాలని కంపెనీలను ఆదేశించారు. అయితే కంపెనీల వారు మాత్రం నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ళ వారిచ్చిన హామీ మేరకు జరపడం లేదు. కొన్ని చోట్ల మాత్రమే నాణ్యమైన పొగాకు కొద్దికొద్దిగా కొంటున్నారు. నల్లబర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోడౌన్ల సామర్థ్యం, నిల్వ ప్రక్రియ, సిబ్బంది, హమాలీల నియామకం, ఏజెన్సీల ఖరారు పనులను అధికారులు పూర్తి చేశారు.

నల్లబర్లీ కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి (ఫైల్)

టుబాకో బోర్డు పరిధిలోకి తేవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

గంగయ్య

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి బాధ్యతారాహిత్యంగా ఉందని, నల్లబర్లీని టుబాకో బోర్డు ▶ 2లో

ఏసీబీ వలలో అవినీతి చేప

- రూ.30 వేలు తీసుకుంటూ..
- పట్టుబడ్డ జలవనరుల శాఖ సీనియర్ అసిస్టెంట్

ఏసీబీకి చిక్కిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని జలవనరుల శాఖపై ఎసిబి అధి కారులు వల విసిరారు. ఆ వలలో ఆ శాఖ స్పెషల్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్ ఎ.శ్రీనివాసరావు లంచం తీసుకుంటూ చిక్కారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జరిగింది.

ఎసిబి నెల్లూరు డిఎస్‌పి (ఒంగోలు ఇన్‌చార్జి) ఎస్.శిరీష కథనం మేరకు.... మార్కాపురం మండలంలో ఈ ఏడాదిలో జలవనరుల శాఖ పలు పనులను చేపట్టింది. రూ.30 లక్షల మేర మూడు పనులను కాంట్రాక్టర్ యేర్వ శ్రీనివాసరెడ్డి దక్కించుకున్నారు. పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు అవసరమైన ఉన్నతాధికారుల ఆమోదం కోసం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పంపాల్సి ఉంది. ఈ పనుల ఆమోదంలో జాప్యం చేయడంతో శ్రీనివాసరావు చెప్పిన మేరకు.. కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఒక్కో ఫైలుకు రూ.10 వేల చొప్పున మూడు ఫైళ్లకు సంబంధించి రూ.30 వేలు చెల్లించేందుకు ఒప్పందం ▶ 2లో

'తల్లికి వందనం' అందనివారి

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- ప్రకాశం కలెక్టర్ తమీమ్‌అన్సారియా

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తల్లికి వందనం పథకం కింద ఆర్థిక ప్రయోజనం దక్కలేదంటూ వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం మండల స్థాయి అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద లబ్ధిదారుల వివరాలను, అనర్హుల వివరాలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ తమకు ప్రయోజనం కలగలేదని అర్జీలు వస్తే వాటిని తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అర్హులందరికీ ఈ పథకం కింద ప్రయోజనం దక్కాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఏయే కారణాల వల్ల ఆర్థిక ప్రయోజనం దక్కలేదో సంబంధిత శాఖల అధికారుల ద్వారా వివరాలు తెలుసుకొని తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు.

ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 10 లక్షల మంది ప్రజలతో యోగాసనాలు వేయించేలా ఇస్తున్న శిక్షణలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న అందరూ పాల్గొనేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. యోగాసనాలు వేసే వేదికలను, పాల్గొనే వారికి ఇచ్చే సర్టిఫికెట్లను ఇప్పటినుంచే సిద్ధం చేయటంపై దష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు వివరించి యోగాసనాలను నిత్యజీవితంలో భాగం చేసుకునేలా చూడాలన్నారు.

ఉపాధి హామీలో వ్యవసాయ అనుబంధ పనులపై ప్రత్యేక దష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారం పాండ్స్, ఫిషింగ్ పాండ్స్ నిర్మాణాలను చేపట్టాలన్నారు. ఫారం పాండ్స్ నిర్మాణంపై ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా దృష్టి ▶ 2లో

బంగారు కుటుంబాల అభివృద్ధికి

పి-4 ద్వారా కృషి

- బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

13 బంగారు కుటుంబాలకు ఆర్థిక సహాయం, ఉపకరణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పి-4 బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పి-4 కింద డిఆర్‌డిఏ దత్తతకు తీసుకున్న బంగారు కుటుంబాలకు చేయూతనందించే కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. బంగారు కుటుంబాల జీవన స్థితిగతులను పరిగణలోకి తీసుకున్న డిఆర్‌డిఏ 13 కుటుంబాలను దత్తత తీసుకుంది. వారికి స్థిరమైన జీవనోపాధులు కల్పించడం కోసం రూ.10.95 లక్షలను కలెక్టర్ మంజూరు చేశారు. చెక్కు రూపంలో నగదును బంగారు కుటుంబాలకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఒకరికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్, ముగ్గురికి వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు.

బంగారు కుటుంబాలకు జిల్లా అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ▶ 2లో

కొద్దికొద్దిగానే..

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా కొనడంతో పాటు, రానున్న కాలంలో నల్లబర్లీ పొగాకును టుబాకో బోర్డు పరిధిలోకి తేవాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో, గుంటూరు పొగాకు బోర్డులో అధికారులతో సమావేశమయ్యారని, కానీ ఈ సందర్భంలో నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలపై స్పష్టమైన వైఖరి వెల్లడి కాలేదని అన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయమై దాటవేత వైఖరిని అవలంబించారన్నారు. నల్లబర్లీ పొగాకు నేరుగా రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయటం వల్ల ప్రభుత్వంపై సుమారు రూ.300 నుంచి రూ.350 కోట్ల పైబడి ఆర్థిక భారం పడనున్న నేపథ్యంలో పొగాకు కొనుగోళ్ల విషయంలో రైతులకు అనేక సందేహాలు ఉన్నాయన్నారు. పొగాకు కొనుగోలు కోసం కేంద్రం నుంచి రూ.150 కోట్లు అడిగారని, కానీ కేంద్రమంత్రి ఎలాంటి హామీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. పొగాకు పంట ద్వారా కోట్ల రూపాయల ఆదాయం పొందుతున్న కేంద్రం, టుబాకో బోర్డు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించకుండా తక్షణమే నల్లబర్లీ పొగాకును టుబాకో బోర్డు ద్వారా కొనుగోలు చర్యలు తీసుకోవాలని, బోర్డు పరిధిలోకి నల్లబర్లీని తేవాలని గంగయ్య డిమాండ్ చేశారు.

ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

వేరే వారికి అమ్మేశాడు. ఈ విషయం గురించి ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు శ్రీనివాసరావు పోతురాజును నిలదీయడంతో వివాదం నెలకొంది. అప్పటినుంచి రెండు కుటుంబాల మధ్య గొడవ జరుగుతోంది. వారిని చెరువు వద్దకు రాకుండా పోతురాజు అడ్డుకుంటున్నాడు. శ్రీనివాసరావు భార్య ఝాన్సీ తమకు లంకలో ఉన్న పొలం వద్దకు మురుకు కాల్వ గట్టుపై వెళుతుంటే పోతురాజు, కన్నా శ్రీనివాసరావు అడ్డుకొని దుర్భాషలాడాడు. గట్టుపై నడవడానికి లేదని.. ఇటు వైపు వస్తే చంపేస్తామని బెదిరించారు. బాధితుడు శ్రీనివాసరావుపై అడవులదీవి పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసి, కేసులు పెట్టించి.. ఇబ్బందులు పెడుతూ వచ్చారు.

ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయం వద్దకు తన కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన శ్రీనివాసరావు తెచ్చుకున్న పెట్రోల్‌ను తనతో పాటు కుటుంబసభ్యులపై పోసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్‌పి కార్యాలయం బయట ప్రజాసమస్యల పరిష్కార వేదిక శిబిరం వద్ద ఉన్న పోలీసులు వారిని అడ్డుకుని జిల్లా ఎస్‌పి వద్దకు తీసుకెళ్లారు. మోపిదేవి పోతురాజు వద్ద రూ 3 లక్షలు అప్పు తీసుకుంటే తమకు తెలియకుండా ఎకరం పొలం రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎవరికి చెప్పుకున్నా తమకు న్యాయం జరగడం లేదని, తమ కుటుంబాన్ని చంపుతామంటూ బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆవేదనతో అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితుడు శ్రీనివాసరావు ఎస్‌పి ముందు తమ గోడు వెలిబుచ్చాడు. వారి సమస్యను సావధానంగా విన్న ఎస్‌పి బాధిత కుటుంబాన్ని పోలీసు రక్షణతో వారి గ్రామానికి పంపారు. రేపల్లె రూరల్ సిఐని నిజాంపట్నం తహశీల్దార్‌తో కలిసి వెళ్లి అక్కడి సమస్యపై విచారణ జరిపి.. మంగళవారం నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ఏసీబీ వలలో అవినీతి చేప

(మొదటిపేజీ తరువాయి)

కుదుర్చుకున్నాడు. ఉన్నతాధికారుల నుండి క్షేత్ర స్థాయి వరకు అందరి ఆమోదం బాధ్యత తాను తీసుకుంటానని శ్రీనివాసరావు చెప్పడం జరిగింది. బిల్లుల చెల్లింపులో మరోమారు పెద్ద మొత్తంలో కమీషన్ ముట్టజెప్పాల్సి ఉంది. ప్రస్తుతం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం సోమవారం నగదు ముట్టజెప్పాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఎసిబి అధికారులకు వివరించారు. ఎసిబి అధికారులు చెప్పిన విధంగా శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు రూ.30 వేలు లంచం ఇస్తుండగా ఎసిబి డిఎస్‌పి శిరీష తన సిబ్బందితో దాడి చేసి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావును పట్టుకున్నారు. శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి శిరీష చెప్పారు. నెల్లూరు జైలుకు తరలిస్తామని ఆమె వెల్లడించారు. దాడిలో ఎసిబి సిఐలు శేషు, రమేష్‌బాబు, ఎస్‌ఐలు ప్రసాద్, షేక్ షరీఫ్, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు ఉన్నారు.

మర్రిపూడి పశువైద్యాధికారిగా మణిశేఖర్

ప్రజాశక్తి-మర్రిపూడి

మర్రిపూడి పశువైద్యాధికారిగా మంచికల మణిశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పొదిలి మండలం ఉన్న గురవాయపాలెం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా మర్రిపూడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామస్తులైన పశువులకు అనారోగ్యం చేసినప్పుడు తక్షణమే తనకు ఒక ఫోన్ చేస్తే తాను ఇంటివద్దకే వచ్చి పశువులను పరీక్షించి తగిన వైద్యం చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

18న పొగాకు రైతులతో ముఖాముఖి

మాట్లాడుతున్న బాణాల రామయ్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో ఈ నెల 18న పొగాకు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. యర్రగొండపాలెం పరిసర ప్రాంత పొగాకు రైతులు ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయం దగ్గరకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, వెంకట శివయ్య, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పెట్టినట్లు ఆమె తెలిపారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతలను కూడా తవ్వించాలన్నారు. ప్రస్తుతం రోజువారీ సగటు కూలి రూ. 251 గా ఉందని, దీనిని రూ.275కు తగ్గకుండా చూడాలన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా మొక్కలను పెంచడంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ, ఇతర ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని స్థానిక వాతావరణ పరిస్థితులకు తగిన మొక్కలను రైతులు నాటేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. "వనం-మనం" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, హాస్టళ్ల ప్రాంగణాలలో మొక్కలను విరివిగా నాటి, వాటి సంరక్షణ బాధ్యతను సంబంధిత కార్యాలయాల అధికారులకు, సిబ్బందికి అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగులో ఉన్న గోకులం షెడ్డుల నిర్మాణ బిల్లులు వారం రోజుల్లో జమ అవుతాయని ఆమె తెలిపారు. హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని కేవలం ఇళ్ల నిర్మాణానికే వారు వినియోగించేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. ప్రతి వారం ఇళ్ల నిర్మాణంలో పురోగతి స్పష్టంగా కనిపించేలా పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. ఆరేళ్ల లోపు చిన్నారులందరూ ఆధార్ కార్డులు పొందేలా చూడాలని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో జెడ్పి సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డిపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అభివృద్ధికి..

పి-4 ద్వారా కృషి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 విధానం బాపట్ల జిల్లాలో అమల్లోకి వచ్చిందన్నారు. అట్టడుగున, అత్యల్ప ఆదాయం ఉన్న కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం సర్వే ద్వారా గుర్తించి బంగారు కుటుంబాలుగా నామకరణం చేసిందన్నారు. అలాంటి కుటుంబాలు బాపట్ల జిల్లాలో 62 వేలు ఉన్నాయన్నారు. వారికి చేయూతనందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. దీంతో జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు 300 మంది మార్గదర్శిలుగా సంబంధిత వెబ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. రూ.50 లక్షలకు మించి వార్షికాదాయం ఉన్న కుటుంబాలను మార్గదర్శిలుగా గుర్తించడం జరిగిందన్నారు. అలాంటి మార్గదర్శిలు 6,000 మంది నమోదయ్యారన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మార్చడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పి-4 విధానంపై విస్తత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ఎస్.ప్రవీణ, గొర్రెల పెంపకం కోసం రూ.2 లక్షలు, టి లక్ష్మి, గహ నిర్మాణం కోసం రూ.2 లక్షలు, కె.అరుణ, కిరాణా దుకాణం కోసం రూ.లక్ష, షేక్ కరిష్మా, ఇంటి నిర్మాణం కోసం రూ.లక్ష, కె.పోలేరమ్మ, చేపల వ్యాపారం కోసం రూ.లక్ష, సింగోతు లక్ష్మి, వ్యవసాయం కోసం రూ.లక్ష, తోట కనకమ్మ, ఇంటి అప్పు కోసం రూ.లక్ష, ఎం. మేరి, కూరగాయల వ్యాపారం కోసం రూ.50 వేలు, కంచర్ల మహాలక్ష్మి ,ఇంటి నిర్మాణం కోసం రూ.50 వేలు నగదు అందజేశారు. అలాగే రూ.50 వేలు విలువచేసే వినికిడి యంత్రాలను పద్మ, వెంకట శేషమ్మ, కోటేశ్వరమ్మకు అందజేశారు. బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్‌ను పెదగంజాం గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి శ్రీనివాసరావు, వెలుగు అధికారులు కె.రవికుమార్, జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు నుంచి ఒంగోలుకు బదిలీపై వెళ్తున్న గిద్దలూరు ఉపఖజానాధికారి వరకుమార్‌ను ఒంగోలు నుంచి బదిలీపై గిద్దలూరు వచ్చిన ఉపఖజనాధికారి నాగేశ్వరావు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణలను సోమవారం గిద్దలూరు విశ్రాంతి ఉద్యోగ సంఘ సభ్యులు సంఘ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా వచ్చిన ఉప ఖజానాధికారి ఉద్యోగులకు మంచి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్ ఎంప్లాయీస్ ఆదినారాయణ, పివి శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మూర్తయ్య, ఎంఏ రంగయ్య, సబ్ ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.

సహాయం చేసేవారికి రివార్డు: ఎస్ఐ

ఎస్ఐ నాగరాజు

ప్రజాశక్తి-కొమరోలు

రోడ్డు ప్రమాదంలో క్షత గాత్రులకు సహాయం చేసేవారికి రివార్డు లభిస్తుందని కొమరోలు ఎస్ఐ జె నాగరాజు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడి సరైన సమయంలో సరైన సహాయం లభించక గాయపడ్డ వారు మృతి చెందుతున్న సందర్భాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీస్, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయటం లేదా క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించి సహాయం చేసే వారికి రివార్డు అందిస్తామని అన్నారు. ఓ ప్రాణాన్ని కాపాడిన దానికన్నా గొప్ప విషయం ఏముంటుందని ఎస్ఐ నాగరాజు అన్నారు.

CHANGE OF NAME

I,UPPUTURI VISHNU TEJA , S/o UPPUTURI RAMESH BABU, R/o Door.No. 37-1-407/9, Bhagya nagar 1st line, SRO Degree PG College, Ongole, Prakasam District, Andhra Pradesh-523001,Have changed my name UPPUTURI VISHNU TEJA to BOYAPATI VISHNU TEJA same as intimated to the Genral Public

పాస్‌పోర్టు పోయినది

పెద్దారవీడు మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన పాస్‌పోర్టు పోయినది. సుంకేసుల నుండి మార్కాపురం వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో జారిపోయినది. పాస్‌పోర్టునెం: V2749146. ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి,
సుంకేసుల గ్రామం,
పెద్దారవీడు మండలం.
సెల్: 9398126558.

గ్రామ పంచాయితీ - అల్లూరు గ్రామము

కొత్తపట్నం మండలం, ప్రకాశం జిల్లా

ఆర్.సి.నెం. 1/2025 — **టెండర్ ప్రకటన** — తేది: 14-06-2025

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామపంచాయితీ నందు తేది: 01-07-2025 నుండి 31-06-2026 వరకు సంవత్సర కాలమును ఈ దిగువ పనులకు నెలవారి కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు తేది: 23-06-2025 ఉదయం 11.00 గంటలకు సీల్డు టెండర్లు స్వీకరించబడును మరియు అదే రోజు సాయంత్రం 3.00 గంటలకు టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఆసక్తి కలవారు టెండరు ధరఖాస్తుకు 500/-లు రశీదు జతపరచవలెను. ఏ కారణము చూపకనే టెండర్లు రద్దు చేయుటకు మరియు వాయిదా వేయుటకు గ్రామ పంచాయతీకి పూర్తి అధికారం కలదు.

వ.నెం	పని వివరములు	వర్తించు కాలము	సంఖ్య	ధరావత్తు
1.	ట్రాక్టర్ డ్రైవర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	2	500
2.	టెర్నెకాక్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500
3.	స్వీపర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500
4.	క్లాప్‌మిత్ర స్వీపర్లు	01-07-2025 నుండి 31-06-2026 వరకు	7	500
5.	ట్యాంక్ వాచర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	2	500
6.	ఇంజన్ డ్రైవర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500
7.	ఎలక్ట్రీషియన్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500

నిబంధనలు : 1) కాంట్రాక్టు సంవత్సర కాలం వరకు 01-07-2025 నుండి 31-06-2026 వరకు
2) గ్రామ పంచాయితీ నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమే వేతనములు చెల్లించబడును.
3) కాంట్రాక్టు రద్దు చేయుటకు గ్రామపంచాయితీకి అధికారము కలదు.
4) కాంట్రాక్టు పని సంతృప్తి లేనియెడల అతని స్థానంలో వేరొకరిని నియమించు అధికరం గ్రామ పంచాయితీ వారికి కలదు.
5) పనిచేయు కాలము బట్టి వేతనమును నిర్ణయించబడును
6) గ్రామ పంచాయితీ బైలా ప్రకారం కార్మికులను తీసుకోబడును.
7) ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయస్సు పరిగణలోకి తీసుకోబడును

షరతులు వర్తిస్తాయి.

పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, అల్లూరు. — సర్పంచ్ గ్రామపంచాయితీ, గ్రామపంచాయతీ, అల్లూరు.

గ్రామ పంచాయతీ కార్యాలయం

కీర్తిపాడు - మద్దిపాడు మండలం

ఆర్.సి.నెం.02/2025 — **టెండర్ ప్రకటన** — తేది:16-06-2025

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కీర్తిపాడు గ్రామ పంచాయతీ నందు 2025-2026 సంవత్సరమునకు తేది. 01-07-2025 నుండి 30-06-2026 వరకు నిర్వహించుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. కీర్తిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తేది. 18-06-2024 ఉదయం 11-00 గంటల నుండి 3-00 గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో టెండర్లు స్వీకరించబడి, అదేరోజు మధ్యాహ్నం 4-00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును, టెండరు షెడ్యూల్ వివరాలు ప్రకారం షరతులు, నిబంధనలకులోబడి ధరావత్తు చెల్లించిన రసీదును టెండరు షెడ్యూలు కు జతపరచవలెను. ఏ కారణం చూపకనే టెండర్లు వాయిదా వేయుటకు, రద్దు పరచుటకు గ్రామ పంచాయతీ వారికి పూర్తి అధికారము కలదు. ఎ మిగతా వివరములు కార్యాలయం పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం	పని వివరాలు	వర్తించు కాలము	సంఖ్య	ధరావత్తు
1.	టర్న్ కాక్	01-07-2025 నుండి 30-06-2026 వరకు	2	100
2.	స్వీపర్లు	01-07-2025 నుండి 30-06-2026 వరకు	1	100

షరతులు : 1. కాంట్రాక్ట్ ఒక సంవత్సర కాలం అనగా 01-07-2025 నుండి 30-06-2026 వరకు మాత్రమే అమలులో ఉండును.
2. గ్రామ పంచాయతీ నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమే వేతనములు చెల్లించబడును.
3. పని సంతృప్తికరంగా లేనియెడల సదరు కాంట్రాక్టును రద్దు చేయు అధికారం గ్రామ పంచాయతీ వారికి కలదు.

సం/- డి.ఆశాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి
కీర్తిపాడు గ్రామ పంచాయతీ,
మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా,

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- కనిగిరి

ఉపాధి కూలీలకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే వారు ఏమితిని బతకాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. మండల పరిధిలోని ఏరువారిపల్లెలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను సోమవారం సందర్శించారు. ఈ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులను పూర్తిగా అయిపోయాయని, దీంతో పనులకు వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. మూడు నెలలుగా చేసిన పనులకు డబ్బులు రాక ఇళ్లల్లో జరుగుబోటు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం పని చేసిన 15 రోజుల్లోగా కూలీలందరికీ డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉందన్నారు. ఆలస్యం జరిగితే వడ్డీతో కలిపి వేయాలని కోర్టు తీర్పు కూడా ఉందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పాలకులు నిర్వీర్యం చేయాలననే తలంపుతో నిధులు కేటాయింపులోనూ, కేటాయిం చినవి సక్రమంగా వినియోగించడంలోనూనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మూడు నెలల పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు జీతాలు తీసుకోకుండా పనిచేస్తారా అని ఆయన ప్రశ్నించారు. అనగారిన వర్గాల పట్ల ప్రభుత్వాలు ఇంత నిర్ధయగా వ్యవహరించటం దుర్మార్గమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కరువు, వలసలు నివారణ, పేదరిక నిర్మూలన కోసం, పేదల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ఉపాధి హామీ చట్టం అమలులోకి తెచ్చినట్లు తెలిపారు. దేశంలో పరిస్థితులు ఆర్థిక సంక్షోభంలో కొనసాగుతున్నందున ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్నారు. అందుకు ఉపాధి హామీకి నిధుల కేటాయింపు పెంచాలన్నారు. తద్వారానే వ్యవస్థ ముందుకు పోయే అవకాశం ఉందని మేధావులు చెబుతున్నట్లు తెలిపారు. ఈ విషయం పాలకుల చెవికెక్కక ఫోవటం విచారకరమన్నారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో ఏడాదికి రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని కోరుతుంటే, కేవలం రూ.80వేల కోట్లు మాత్రమే కేటాయించి చట్టాన్ని బలహీన పరుస్తున్నారని తెలిపారు. చట్టానికి కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిత్యం కరువుతో, వలసలతో కొనసాగుతున్న కనిగిరి ప్రాంతంలో కనీసం ఏడాదికి 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్షాధారం మీదనే పంటల పరిస్థితి కారణంగా ఈ ప్రాంతంలో పనులు దొరకక ప్రజలు వలసలు తీవ్రంగా పోతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితులో ఉపాధి పనులు కల్పించడం ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దమ్ము వెంకటయ్య , ఫీల్డ్ అసిస్టెంట్ డి. కిరణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి. ఆదయ్య,

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

19న మండల సమావేశం

ప్రజాశక్తి- కనిగిరి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 19న మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపి డిఒ ప్రభాకరశర్మ సోమవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలన్నారు. మండల పరిధిలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల తీరు, అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని సర్పంచులు, ఎంపిటిసి పాల్గొనాలని కోరారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా ముస్తాక్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ తహశీల్దారు టి.రవి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న షేక్ ముస్తాక్ ఇన్‌ఛార్జిగా నియ మితులయ్యారు.

జూనియర్ అసిస్టెంట్‌గా వెంకట్రావు

ప్రజాశక్తి -పామూరు

పామూరు గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా గరికపాటి వెంకట్రావు, రెగ్యులర్ బిల్ కలెక్టర్‌గా ఎస్.కష్ణవేణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గ్రామ కార్యదర్శి జి. అరవింద రెడ్డి సమక్షంలో వారు బాధ్యతలు స్వీకరించారు. జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన గరికపాడు వెంకట్రావు బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడి వచ్చారు. బిల్ కలెక్టర్ కష్ణవేణి పొదిలి నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తూ రిఫ్రిటేషన్ ద్వారా గత కొంతకాలం నుంచి పామూరులో పనిచేస్తూ డిపి ఉత్తర్వులు మేరకు రెగ్యులర్ బిల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కొండపి ఎఒగా మాల్యాద్రి

ప్రజాశక్తి-కొండపి

వ్యవసాయానికి సంబంధించిన ప్రతి పథకం రైతులకు అందేలా విఎఎలు కృషి చేయాలని ఎఒ మేడికొండ మాల్యాద్రి తెలిపారు. కొండపి ఎఒగా మేడికొండ మాల్యాద్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శింగరాయకొండలో సాంకేతిక విభాగం వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న మాల్యాద్రి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎఒను వ్యవసాయ శాఖ సిబ్బంది మర్యాద పూరక్వంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీలోని కురిచేడు రోడ్డులో నివాసముంటున్న పసుపులేటి బ్రహ్మయ్య అనే కూలీ ఒంగోలు పని నిమిత్తం వెళ్లారు. అక్కడ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ ధీనస్థితిని గురించి స్థానికులు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులకు తెలిపారు. దీంతో స్పందించిన మానవత సంస్థ ప్రతినిధులు తమ సంస్థ ద్వారా రూ.5 వేల చెక్కును అందజేశారు. దాతల సహకారంతో మరో రూ.4వేల నగదును అందజేశారు. సంస్థ ప్రతినిధులు దేవతి వరప్రసాదు, కపురం శ్రీనివాసరెడ్డి, గొర్రెపాటి వేణు, జె.సుశీలమ్మ, చీదెళ్ళ బసవయ్య, రోశారావు. స్థానిక పెద్దలు పాణెం రహిమాన్, ల్యాబ్ సత్యం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

ఇదెక్కడి న్యాయం..!

ఎంపిహెచ్‌ఎఫ్ నర్సుల ఆవేదన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిలాల్లో 2019లో సచివాలయ వ్యవస్థను ప్రారంభమైంది. సచివాలయాలకు ఎఎన్ఎంలను నియమించారు. అనంరతం రెగ్యులర్ ఎంపిహెచ్‌ఎఫ్‌లకు 2022లో కౌన్సిలింగ్ నిర్వహించారు. రీడిప్లయ్‌మెంట్ అంటూ మండలాల వారీగా ఉన్న రెగ్యులర్ ఎంపిహెచ్‌ఎఫ్‌లను సచివాల యాల్లో నియమించారు. మిగిలిన రెగ్యులర్ ఎఎన్ఎంలను వారి పోస్టులకే పంపారు. అనంతరం 7 రోజుల తరువాత ఖాళీలు ఉన్న ప్రాంతాల్లో జాయిన్ కావాలని ఆర్డర్స్ పంపారు. కొందరు అదే ప్లేస్ ఉంచాలని కోరుతూ కోర్టు నుంచి స్టే తెచ్చుకుని అక్కడే కొనసాగుతున్నారు. ఇప్పుడు 2024- 2025లో జనరల్ బదిలీలు నిర్వహించారు. ఈ బదిలీల్లో 5 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కచ్చితంగా వెళ్లిపోవాలని చెప్పారు. కొందరూ యూనియన్ సహకారంతో రీడిప్లయ్‌మెంట్ కింద ఎక్కడ పనిచేస్తున్న వారు అక్కడే ఉండవచ్చునని బదిలీలు ఆపారు. 12 సంవత్సరాల సీనియారిటీ ఉన్నవాళ్లు కూడా అదే ప్రాంతంలో కొనసాగిస్తున్నారు. సబ్ సెంటర్ లెవెల్‌లో ఆరు గ్రామాలు ంటాయి. ఆ గ్రామాల్లోని వారికి రీడిప్లైమెంట్ ఎలా ఇస్తారని, . ఇప్పుడు దూర ప్రాంతంలో ఉండి పనిచేస్తున్న ఎంపిహెచ్ఎ(ఎఫ్) లకు సీనియారిటీ పోతుందని ఎంపిహెచ్‌ఎఫ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ 12 సంవత్సరాలు నిండి ఉన్న వాళ్లకు సీనియారిటీ పెరుగుతుంది కనుక వారు ఆ ప్రాంతంలో ఆనందంగా పనిచేస్తారు. దూర ప్రాంతం వారికి ఖాళీలు లేవు. ఏదో ఒక ప్లేస్ తీసుకున్నా వారికి రెండు సంవత్సరాల తర్వాత బదిలీకి అవకాశం ఉండదు. వారికి సర్వీసు రెండు సంవత్సరాలే ఉంటుంది. అలా కాకుండా ఐదు సంవత్సరాలు నిండిన, స్టేషన్ సీనియారిటీ ఉన్న వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తే అందరికీ సమన్యాయం జరుగుతుందని వారు పేర్కొంటున్నారు. ఇటీవల గ్రేడ్-3 ఎఎన్ఎంలకు గ్రేడ్-2 ఎఎన్ఎంలుగా ప్రమోషన్ ఇచ్చారు.వారు కొత్త ప్లేస్ లోనే జాయిన్ అయి పాత ప్లేస్‌లోనే జీతాలు తీసుకుంటున్నారు. 25 సంవత్సరాలు సర్వీసు ఉన్న ఎఎన్ఎంలు దూర ప్రాంతంలో ఉద్యోగం చేస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఐదు సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి కౌన్సిలింగ్ నిర్వహిస్తే తమకు సమన్యాయం జరుగుతుందని వారు భావిస్తున్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్

ప్రజాశక్తి- కనిగిరి

దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న కేసులపై ప్రత్యేక దష్టి సారించి వాటిని వెంటనే పరిష్కరించాలని డిఎస్‌పి పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. కనిగిరి డిఎస్‌పి కార్యాలయంలో క్రైమ్ రివ్యూ సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ కేసులు పెండింగ్‌లో లేకుండా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, అనుమానాస్పద మతి కేసులు, రౌడీ షీటర్లు, అనుమానాస్పద రౌడీషీటర్లు పట్ల వ్యవ హరించాల్సిన చర్యలపై డిఎస్‌పి సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల మన్ననలు పొందాలని పోలీసు సిబ్బందికి తెలియజేశారు. ఈ సమావేశంలో కనిగిరి సిఐ షేక్ ఖాజావలి, డివిజనల్ పరిధిలోని ఎస్‌ఐలుపాల్గొన్నారు.

చీమకుర్తి : చీమకుర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులు, వాహనాలను సత్వరం క్లియర్ చేయాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఎస్‌కె. ఆయేషా బేగం ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం. ఎం.సుకన్య, ఎస్‌ఐ నాగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ

పొగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

ప్రజాశక్తి-సిఎస్.పురం : మండల పరిధిలోని ఏకునాంపురం గ్రామానికి చెందిన కోట తిరుమలరాయుడు, పెదగోగులపల్లి గ్రామానికి చెందిన ఏనుబూరి జానీ, సిఎస్.పురం గ్రామానికి చెందిన బండారు. బాలవెంకటేశ్వర్లు సెల్ ఫోన్లు పోయాయి. దీంతో బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఎస్.పురం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు నాయక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మొబైల్స్‌ని కనుగొని రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి నాగులుప్పలపాడు : మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై ఎస్‌ఐ షేక్.రజియా సుల్తానా ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నిర్వహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎఒ సంపత్ కుమార్ బదిలీ

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్ : సిఎస్‌పురం ఎఒ బలబత్తిని సంపత్ కుమార్ కురిచేడు మండలానికి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా ఈ యన కురిచేడుకు బదిలీ అయ్యాడు. కురిచేడు ఎఒగా బి.మధుబాబును సిఎస్‌పురం ఎఒగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

సిపిఎం డిమాండ్

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ముండ్లమూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజల కు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని మారెళ్ళలో సిపిఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే సంక్షేమ పథకాలు రెట్టింపుగా అమలు చేస్తామని, సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్ళు అని చెప్పిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల హామీలు ఒకటి, రెండు తప్ప మిగిలినవి అమలు చేయకుండానే సంబరాలు జరుపుకోవటం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచి పంపిణీ చేయడం మంచి అంశమే అయినా మిగిలిన ఐదు హామీల్లో కొన్ని అరకొరగా ప్రారంభించి, కొన్ని అసలు ప్రారంభించలేదని అన్నారు. 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మెగాడిఎస్సి ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది గడిచిన ఒక కొత్త ఉద్యోగం ఇవ్వలేదని అన్నారు. ఉద్యోగాలు వచ్చేలోపు నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఎప్పుడు ఇస్తారో ఇంతవరకు చెప్పలేదని అన్నారు. ఆడబిడ్డకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్న పథకం ప్రస్తావన లేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏడాది గడిచినా అమలుకు నోచుకోలేదని అన్నారు. భరోసా ఎప్పుడు ఇస్తారని రైతులు ఎదురు చూస్తున్నారని అన్నారు. తల్లికి వందనం పథకం గతేడాది ఇవ్వలేదని, ప్రతి బిడ్డకు రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.2వేలు కోతకోశారని విమర్శించారు. దీపం 2 పథకం మాటలకు ఆచరణకు పొంతన లేకుండా ఉందని ఎద్దేవా చేశారు. చెప్పిన హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్ను, నిత్యవసర వస్తువుల ధరల పెంచి ప్రజల మీద భారం మోపటం అన్యాయమని అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమన్నవాళ్లు నేడు బలవంతంగా స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు రైతులు ఏ పంట వేసినా గిట్టుబాటు ధర లేదని, ఆత్మహత్యల దారి పడితే వారి సమస్యలపై రైతు సంఘాలు ఉద్యమించే వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి ఇప్పటివరకు పొగాకు ఎందుకు కొనుగోలు చేయించ లేకపోయారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తను ఇచ్చిన హామీలు వెంటనే అమలులోకి తేవాలని, ప్రారంభించిన పథకాల్లో లోపాలు సవరించి అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయనందున ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని, ఇది ఆగ్రహంగా మారక ముందే ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. అధికారంలోకొస్తే వాటిని అమలులోకి తెస్తామని ఎన్నికలకు ముందుగా కూటమి నేతలు చెప్పారని అన్నారు. ఏడాది గడిచినా వాటి పునర్నిర్మాణానికి తగిన ప్రయత్నం జరగలేదని అన్నారు. మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు అర్హులైన పేదలకు ఇవ్వాలని, అనేక సంవత్సరాలుగా పేదలు సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలివ్వాలని కోరారు. సమావేశానికి ఎస్‌కె మీరావళి అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఎం నాయకులు బోడపాటి హనుమంతరావు, మారెళ్ళ, గంగనపాలెం, జమ్ములమడక నాయకులు మేకల హనుమంతరావు, హనుమయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, వెల్లంపల్లి శ్రీను, వి మల్లేశ్వరి, అంజయ్య పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు స్వీకరించిన తహాశీల్దారు గోపికృష్ణ

తహాశీల్దార్ గోపీకృష్ణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వేటపాలెం

విధుల్లో నిర్లక్ష్యం, ఉదాశినత సహించేదే లేదని తహాశీల్దారు గోపికృష్ణ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక తహాశీల్దారు కార్యాలయంలో ఆయన అదనపు బాధ్యతలు సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలని చెప్పారు. పూర్వపు తహాశీల్దారు పి పార్వతిని కమిషనరేట్‌కు సరెండర్ చేయడంతో ఆమె స్థానంలో చీరాల తహాశీల్దారు గోపికృష్ణకు వేటపాలెం తహాశీల్దారు అదనపు బాధ్యతలు కేటాయించారు.

టేబుళ్లు, క్లాక్ బహూకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

కంప్యూటర్ టేబుళ్ల బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ మిత్రుల ఆర్థిక సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయానికి రెండు కంప్యూటర్ టేబుల్స్, వాల్‌క్లాక్ సోమవారం బహుకరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆడుసుమల్లి కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన సభలో సంఘ కార్యదర్శి నిమ్మరాజు నాగేశ్వరావు, కోశాధికారి వారణాసి రఘురామశర్మ, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, నర్రా గోపాలరావు, మక్కెన వేంకటేశ్వర్లు, అంకయ్య, బ్రహ్మానందం, జయరాణి, రామారావు, మోహనరావు, రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అన్నంగి సుబ్బారావు, అళహరి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఎఫ్ఎ యోహానును సన్మానిస్తున్న ఉపాధి హామీ కార్మికులు

యోహానుకు ఉపాధి కార్మికుల సత్కారం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని విజయనగర్ కాలనీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దుడ్డు యోహానును ఉపాధి హామీ కార్మికులు శాలువాతో సోమవారం సత్కరించారు. ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు నిర్వహిస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పని దినాలు కల్పిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులు చేస్తున్నా ప్రజలకు ఉపాధి పనులు ఎక్కువ రోజులు కల్పిస్తూ ప్రభుత్వ లక్ష్యంను పూర్తి చేయటం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. పని దినాలు కల్పించినందుకు ఉపాధి హామీ కార్మికులందరూ ఫీల్డ్ అసిస్టెంట్ యోహానును ఘనంగా సన్మానించారు. ఉపాధి హామీ కూలీల పక్షంగా తేళ్ళ రాంబాబు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ దుడ్డు యోహాను పనిదినాలు కల్పించి కార్మికులకు తగు జాగ్రత్తలు సూచిస్తు క్రమశిక్షణతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయించి కూలీలకు కనీస వసతిని ఏర్పాటు చేశారని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సన్మానం చేశారు. యోహాను మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఉపాధి కూలీలు సమయపాలన పాటిస్తూ సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.

సిపిఎం సభ్యులు బాపూజీకి నివాళి

కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఎం సీనియర్ నేత జాలా అంజయ్య

నివాళులు అర్పిస్తున్న సిపిఎం నేత జాలా అంజయ్య

ప్రజాశక్తి - చీరాల

సిపిఎం సీనియర్ సభ్యులు కామ్రేడ్ పాదర్తి బాపూజీ ఈ నెల 6న గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని గాంధీనగర్ గౌస్‌బేగ్ తోటలో ఆయన నివాసం వద్ద బాపూజీ దశదిన కర్మ సోమవారం నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, చీరాల కార్యదర్శి ఎన్ బాబురావు, సీనియర్ నాయకులు పి కొండయ్య, ఎం వసంతరావు పూల మాల వేసి నివాళులు అర్పించారు. బాపూజీ కొడుకు పి సాయిరాం ప్రస్తుతం యువజన సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్నారు. బాపూజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాపూజీ గతంలో సిపిఎం కమిటీ సభ్యునిగా వృత్తిదారులు, ప్రజా సమస్యలపై అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. వారి వెంట యువజన సంఘం సభ్యులు అనిల్, భగవాన్ దాస్, మణి కుమార్ ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగుల నాయకులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కరి కమలేశ్వరరావు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చీరాల ఉపఖజానా అధికారి రమణారెడ్డిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. సంఘం పక్షాన ఉపకజానా అధికారిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఇంకొల్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తగిరశ వీరాంజనేయులు, సీనియర్ సభ్యులు ఆవుల హనుమంతరావు పాల్గొన్నారు. ఒక నెలలోపు పెండింగ్ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఉపకజానా అధికారి రమణారెడ్డి హామీ ఇచ్చారు.

'తల్లికి వందనం' రాని వారి ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - వేమూరు

తల్లికి వందనం పథకం కింద నగదు జమ కాని లబ్ధిదారులు నేటి నుంచి గ్రార్డు, గ్రామ సచివాలయంలో పిర్యాదులు స్వీకరిస్తుందని వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు ఎంఇఒలు ఐ వెంకటేశ్వర్లు, నీలం దేవరాజ్, కలపాల రమేష్ తెలిపారు. ఏ కారణం చేతైతే తిరస్కరణ అయ్యిందో అది కాదని నిరూపించుకునే ఆధారం పిర్యాదుతో కుటుంబ సభ్యుల ఆధార్లు జత చేయాల్సి ఉందన్నారు. దరఖాస్తుపై చైల్డ్ ఇన్ఫో తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. పిల్లల ఇకెవైసి, బ్యాంకు కాతాకు ఆధార్ అనుసంధానం చేసుకుని ఉండాలని సూచించారు. అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ తిరస్కరణకు గురైతే ఏ కారణంతో తిరస్కరించారో తెలుసుకుని ఆ కారణానికి సంబంధించిన ధృవీకరణ అందజేయాలని సూచించారు. అలా చేస్తే పరిశీలించి తల్లికి వందనం నగదు జమ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో జీడిపప్పు కార్మికుల పిల్లలకు నోట్ పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, చదువులు సజావుగా సాగేందుకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చదువు ద్వారా ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. పిల్లలు విద్యావంతులైనప్పుడే కార్మికుల కళ్ళల్లో ఆనందం వెల్లివిరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ బట్ట మోహనరావు, సహాయ కార్యదర్శి నాగాంజనేయులు, పత్తి శరత్‌బాబు, జి శేఖర్ బాబు, మందా రావు బుల్లియా, తిలక్, అయ్యప్ప, శ్రీను పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు అందిస్తున్న దాతలు

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతలు తమ వంతు సహకారం అందించాలని పట్టణంలో ఆజాద్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పురం వెంకట సాంబశివరావు అన్నారు. స్థానిక శోభ మ్యాచింగ్ సెంటర్ యజమాని మోటమర్రి సురేష్ తండ్రి మోటమర్రి మల్లిఖార్జునరావు జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటు పుస్తకాలు, వ్రాత సామాగ్రి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నోటు పుస్తకాల దాతలైన డాక్టర్ చల్లా రామమోహనరావు, నాళం సురేష్, విద్యా కమిటి చైర్మన్ షేక్ హుస్సేన్, ఉపాధ్యాయులు బి రామకృష్ణ, కోటేశ్వరరావు, విజయ్, మల్లేష్, పివి రమణ, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ కలిసి వినతిపత్రాల ద్వారా కోరారు. తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపగా కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటలు, సాగునీటి కాల్వల ఆక్రమణలను మూడు నెలల్లో తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ ద్వారా అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలతో వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 24,327 నీటి సంఘాల కమిటీలు ఉన్నాయన్నారు. 48,020 ఎకరాలు నీటి సంఘాల పరిధిలో ఉన్నాయన్నారు. 305 చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. 2,449 మంది అక్రమణదారులు 299 ఎకరాలను ఆక్రమించారని చెప్పారు. ఆక్రమణలు తొలగించే ప్రక్రియకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలలో తమ పేర్లు నమోదు చేసుకున్న వారంతా ఈనెల 21 తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని కలెక్టర్ చెప్పారు. అంతర్జాతీయ కార్యక్రమానికి అనుబంధంగా సూర్యలంకలో పదివేల మందితో యోగాసనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 6.74 లక్షల మంది యోగాంధ్రలో పాల్గొనడానికి తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. పీఈటి ఉపాధ్యాయులు వెయ్యి మంది, ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఒక వెయ్యి మంది, కేర్ నేచురోపతి మెడికల్ కళాశాల విద్యార్థులు 500 మంది, యోగాంధ్రలో నమోదు చేసుకున్న వారంతా హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 19న చీరాల నగర వనంలో యోగాంధ్ర అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, డిఆర్‌డిఏ పి డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

చేనేతలకు మంచి రోజులు

- కుప్పడం చీరకు జాతీయస్థాయి గుర్తింపు
- కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి గుర్తింపు లభించడంతో చేనేతలకు మంచి రోజులు వచ్చాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి గుర్తింపు లభించడంతో జిల్లాలోని చేనేత సహకార సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ జె వెంకటమురళిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంగా నివేదించడంతో కుప్పడం చీరకు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కార్మికుల కలలు నెరవేరాయన్నారు. అవార్డు వచ్చేలా కషి చేశారని కలెక్టర్ వెంకట మురళి కి చేనేతలు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. చీరాల కుప్పడం పట్టు చీరలకు గుర్తింపు లభించడం ద్వారా చీరలకు మంచి డిమాండ్ పెరుగుతుందని కలెక్టర్ చెప్పారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న చేనేత కార్మికుల కలలు నెరవేరుతాయన్నారు. చేనేత వత్తికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. తద్వారా చేనేతల సమస్యలన్నీ తీరిపోతాయన్నారు. చేనేత కార్మికులందరికీ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. మీ అందరి కషితోనే కుప్పడం పట్టు చీరలకు ప్రాచుర్యం వచ్చిందన్నారు. గుర్తింపుతో చేనేతలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా చేనేత చేనేత జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె నాగమల్లేశ్వరరావు, చేనేత సహకార సంఘాల నాయకులు దివి రాంబాబు, జీవి నాగేశ్వరరావు, కె.వి నాంచారయ్య, శ్రీనివాసరావు, పి వెంకట సుబ్బారావు, పి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వెంకటమురళిని సత్కరిస్తున్న చేనేత సహకార సంఘాల నేతలు

ఎస్పీ గ్రీవెన్స్‌కు 36 అర్జీలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజల చట్టపరమైన సమస్యలు పరిష్కరించడానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి నిర్వహించారు. కుటుంబ సమస్యలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక మోసాలు, భూవివాదాలు ఇతర పలు రకాల సమస్యలను చెప్పుకోవడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి అర్జీదారులు వచ్చారు. ఎస్పీ ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీలను వేగవంతంగా విచారించి చట్ట పరిధిలో నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్పీ నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి మొత్తం 36 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ యు.శ్రీనివాసులు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కెజిబివిల్లో బదిలీలకు మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాలోని, 28 కస్తూరిబా విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్స్ సిబ్బంది బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహించడానికి ఆ సంస్థల రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మార్గదర్శకాలను సోమవారం నాడు విడుదల చేశారు. ఆ సంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్, ఇంక్లూజీవ్ ఎడ్యుకేషన్ రీ సోర్స్ పర్సన్స్,పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్స్, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్, మండల్ లెవల్ అకౌంటెంట్స్, సైట్ ఇంజనిర్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మెసెంజర్స్, ఆఫీస్ సభఆర్డినేట్స్ బదిలీలకు ఈ నెల 19 నుంచి 21 దరఖాస్తు చేసుకోవాలి.

50 మించి పాయింట్లు అనుమతించబడవు..

ఒకే చోట ఎక్కువ కాలం పని చేసి 40 ఏళ్ల పైబడిన అవివాహితకు 50 పాయింట్లు మించకుండా వేస్తారు. పాఠశాల ప్రాంతాలనను సరించి 1వ కేటగిరి ప్రాంతం లో ఏడాది కి 1, రెండో కేటగరీ ఏరియా లో 2, 3వ కేటగరి ఏరియాలో 3, 4వ కేటగరీ ఏరియా లో పని చేసిన వారికి ఏడాదికి 5 పాయింట్లు చొప్పున 30 పాయింట్లకు మించి అనుమతించరు. కాగా అభ్యర్థులు కేన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టి బి, కిడ్నీ, వెన్నుపూస వంటి వ్యాధులకు గురైన వారు శస్త్రచికిత్స చేయించుకున్న వారు ప్రిఫరెన్షియల్ కోటాలో దరఖాస్తు చేసుకోవచ్చు. వారి పిల్లలు ఎవరైనా గుండెల్లో రంధ్రం ఉన్నవారు, తలసేమియా, హిమోఫీలియా, మస్కులర్ డిస్ట్రాఫి వ్యాధి బారిన పడిన వారు ఉంటే అటువంటి సిబ్బంది కూడా ప్రిఫరెన్షియల్ కోటాలో దరఖాస్తు చేసుకోవచ్చు. స్పౌజ్ కింద కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

19 నుంచి బదిలీ దరఖాస్తులు..

24న సీనియారిటీ లిస్టు ప్రకటన...

వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ లిస్టు ను ఈ నెల 23 న సీనియరిటీ లిస్టు తయారు చేసి, 24 న ప్రకటిస్తారు. ఈ సీనియారిటీ లిస్టుకు సంబందించి అభ్యర్ధనలు, సందేహాలు ఉన్నట్లయితే 27 లోపు గ్రీవెన్స్ లో దరఖాస్తు చేసుకోవాలి. 28 న తుది జాబితా విడుదల చేసి, ఈ నెల 30 నుంచి 3రోజులు పాటు జులై 2,వరకు బదిలీల ప్రక్రియకు కౌన్సిలింగ్ చేపట్టనున్నట్లు మార్గదర్శకాలు రూపొందించారు. కాగా జులై 5 లోపు బదిలీలపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో ఫిర్యాదు చేసుకోవాలి.

కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ...

బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా విద్యా శాకాధికారి మెంబర్ గా, సర్వశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ మెంబర్ కన్వీనర్ గా, డైట్ ప్రిన్సిపాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, జిసిడిఒ సభ్యులు గా ఆరుగురితో కమిటీ ఏర్పాటు చేస్తారు. వీరి పర్యవేక్షణలో బదిలీలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

నిలకడగా పొగాకు ధరలు

29 శాతం బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు ధరలు స్థిరంగానే ఉన్నాయి. పెద్ద మార్పు లేదు. సోమవారం వారం నాడు కొనుగోళ్లు, ధర స్వల్పంగా పడిపోయింది. బ్లాక్ సాయిల్ పరిధిలో మొన్నటి కంటే కిలోకు రూ.4.22 తగ్గడం గమనార్హం. దీంతో పాటు నోబిడ్ శాతం కూడా పెరిగింది. శనివారం నాడు 27.66 శాతం తిరస్కరించగా.. ఈ రోజు 29.31 బేళ్లు తిరస్కరించారు.

సోమవారం నాడు రీజియన్ పరిధిలో 8777 బేళ్లు ఆక్షన్ కి రాగా 6201 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాలు చూపి 2,576 బేళ్లను (29.31 శాతం) తిరస్కరించారు. బ్లాక్ సాయిల్ పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 4427 బేళ్లు ఆక్షన్‌కు తేగా 3223 బేళ్లు కొనుగోలు చేశారు. ఇక్కడ 1204 (27.19%) బేళ్లు తిరస్కరించారు. కిలో రూ కనిష్ఠ ధర రూ.180, గరిష్ట ధర రూ.280 పలికింది. సగటున కిలో రూ.244.47 (మొన్నటి కంటే రూ 4.42 తగ్గింది) పలికింది. కాగా లైట్ సాయిల్ పరిధిలో పొదిలి, కనిగిరి, కందుకూరు 1, 2, కలిగిరి, డిసి పల్లి కేంద్రాల్లో 4350 బేళ్లు ఆక్షన్‌కు తేగా 2978 బేళ్లు కొనుగోలు జరగ్గా అధిక మొత్తంలో 1372 (31.54 శాతం) బేళ్లు తిరస్కరించారు. ఇక్కడ కిలో గరిష్ట ధర రూ 280 కాగా కనిష్ఠ ధర 180కి దిగజారింది. సగటున కిలో రూ 246.35 (మొన్నటి కంటే స్వల్పంగా రూ 0-82 పైసలు పెరిగింది) పలికింది.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

ఎస్పీ తుషార్‌డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ద్విచక్ర వాహనాలలో రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు 16 వాహనాలను బాపట్ల జిల్లాకు కేటాయించబడ్డాయి. వాటిని సోమవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం అవరణలో జిల్లా ఎస్పీ ప్రారంభించారు.అనంతరం ప్రజలకు హెల్మెట్ యొక్క ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది హెల్మెట్ ధరించి పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం, చీలు రోడ్డు, పాత బస్టాండ్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మతి చెందుతున్న వారిలో ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులేనని, తలకు బలమైన గాయాలే ఎక్కువ మరణాలకు కారణమవుతున్నాయన్నారు. దీనికి ప్రధాన కారణం హెల్మెంట్ ధరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమేనన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. తలకు గాయాలు కాకుండా హెల్మెట్ రక్షణ కల్పిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు వేగవంతంగా ఆ ప్రదేశానికి చేరుకొని క్షతగాత్రులకు సహాయం అందించడానికి, పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అనుకూలంగా ఉండే 16 ద్విచక్ర వాహనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుండి బాపట్ల జిల్లాకు కేటాయించబడినయన్నారు. వాటిలో టీవీఎస్ అపాచీ ఆర్ టి ఆర్ 160 సీసీ ద్విచక్ర వాహనాలు 15, రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ ఒకటి ఉన్నాయన్నారు. వీటికి పోలీస్ సైరన్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ప్రథమ చికిత్స కిట్ లతో పాటు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని జత చేయడం జరిగిందన్నారు. బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి, మార్టూరు, చెరుకుపల్లి, భట్టిప్రోలు ప్రాంతాలలో ట్రాఫిక్ ను క్లియర్ చేయడానికి వీటిని వినియోగించనున్నామన్నారు. అంతేకాకుండా బాపట్ల జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సూర్యలంక, వాడరేవు - రామాపురం సముద్ర తీర ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహించేందుకు, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు ఈ ద్విచక్ర వాహనాలను వినియోగించనున్నామన్నారు. నూతన ద్విచక్ర వాహనాలు ట్రాఫిక్ క్రమబద్ధీకరించే పోలీస్ సిబ్బందికి వారి విధులు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, ఎమ్.టి ఆర్.ఐ శ్రీకాంత్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ర్యాలీలో ఎస్పీ తుషార్ డూడి

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ ఆయేషా బేగం సోమవారం జిల్లా ఎస్పీ ఛాంబర్‌లో ఎస్పీ ఏ.ఆర్.దామోదర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఆయేషా బేగం నెల్లూరు జిల్లా ఏపీఎస్ బీసీఎల్ లో విధులు నిర్వహిస్తూ ప్రకాశంకు బదిలీపై వచ్చారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆయేషాబేగం

పొగాకు రైతుల పట్ల కేంద్రమంత్రి బాధ్యతారాహిత్యం

- పొగాకు ద్వారా రూ.70వేల కోట్లు ప్రభుత్వానికి ఆదాయం
- పొగాకు రైతుల కోసం రూ.2వేల కోట్లు కేటాయించలేరా?
- రైతు సంఘం నేతలు కందిమళ్ల, తలపనేని

ప్రజాశక్తి - ఇంకొల్లు

పొగాకు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.70 వేల కోట్ల ఆదాయం వస్తుందని, రైతుల కోసం రూ.2వేల కోట్లు కేటాయించలేరాని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు ప్రశ్నించారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సిఎం చంద్రబాబు, పొగాకు బోర్డుతో సమావేశమైనప్పటికీ ఆయన మాట్లాడిన మాటలు చూస్తే రైతుల పట్ల ప్రేమలేనట్లుగా ఉందని అన్నారు. రాష్ట్రంలో పొగాకు రైతుల పట్ల బాధ్యతారహితంగా మాట్లాడాలని ఆరోపించారు. మంత్రి పియుష్ గోయల్ గతేడాది పొగాకు మంచి గిరాకీ ఉన్నందువల్ల కంపెనీలు ప్రోత్సహించడం వల్లనే ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారని అన్నారు. గతేడాది కంపెనీల దగ్గర నిల్వ ఉంటే ఈ ఏడాది వేయమనరు కదా? ఈ ఏడాది పొగాకును సరిగా కొనుగోలు చేయలేదు కదా? కంపెనీల దగ్గర పొగాకు నిల్వలు ఉండాయి అనటం మంత్రి ప్రకటన బాధ్యతా రహితంగానే ఉందని అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పొగాకు రైతుల వల్ల సంవత్సరానికి రూ.కోట్ల ఆదాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపేణా ఆదాయం వస్తుండగా రైతు కష్టాల్లో ఉన్నప్పుడు రూ.2వేల కోట్లు కేటాయించి పొగాకును కొనుగోలు చేయలేరా? అని ప్రశ్నించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన బాధ్యత రాహిత్యం అన్నారు. బర్లీ పొగాకు రైతులును ఆదుకునే ప్రకటన చేయలేదని అన్నారు. కంపెనీల చేత కొనిపిస్తామని గాని, టోబాకో బోర్డు పరిధిలో చేరుస్తామని గాని ప్రకటన చేయకుండా, కంపెనీలకు వత్తాసు పలికారని అన్నారు. ఇది రైతుల పట్ల బిజెపి వైఖరికి నిదర్శనం అన్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న టిడిపి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పొగాకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి

గ్రీవెన్స్‌లో 10 వినతులు

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 10 వినతలు అందాయని ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి తెలిపారు. అర్జీ దారులు తమ సమస్యలు వెల్లడిస్తూ వినతి పత్రాలు అందజేశారు. ఆయా వినతుల పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు ఆర్డిఓ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామని అన్నారు.

చోరీకి గురైన మోటర్లు పరిశీలిస్తున్న రైతులు

మోటార్ల వద్ద రాగితీగ చోరీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడు, అడవిపాలెం, ఏల్చూరు, సజ్జాపురం తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో రాగితీగ వరుస చోరీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవిపాలెంలో ఇటీవల రైతులు సాగు చేసిన పంట పొలాల్లో రాత్రులందు 600 మీటర్ల రాగి తీగ చోరీకి గురైంది. అడవిపాలెంలోని పొలాల్లో 12 మోటర్ల వద్ద చోరీ చేశారు. దీంతో రైతులు రూ.50 వేల వరకు నష్టపోయారు. దీంతో మోటార్ల ద్వారా సాగునీరు ఆలస్యమై రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. పోలీసులు స్పందించి చోరీలకు పాల్పడే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చుండూరు

మండలంలోని మోదుకూరు ఆరోగ్య కేంద్రం నందు ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు అర్హులైన అభ్యర్ధులు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కె ఇందిరా ప్రియదర్శిని ప్రకటనలో కోరారు. మోదుకూరు2 సచివాలయం పరిధిలో అర్హులైన అభ్యర్థులు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు ఆయా సచివాలయ పరిధిలోని వారై ఉండాలని తెలిపారు. దరఖాస్తు కోసం చుండూరు గవర్నమెంట్ ఆసుపత్రి సూపర్వైజర్‌ను సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ సమస్యలపై వినతి

ప్రజాశక్తి - అద్దంకి

తెలుగు నాడు అంగన్వాడి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని కలిసి సమస్యలపై వినతి పత్రం సోమవారం అందించారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూరగాయలు, గ్యాస్ ధరలు పెంచాలని, కొంత మంది అంగన్వాడీలు అనారోగ్యాల కారణంగా యాప్ పని భారంతో వయసు పెరిగి పనిచేయలేకున్నారని, అలాంటి వారికి వాలంటరీ రిటైర్మెంట్‌కు అవకాశం, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రతి సమస్య పరిశీలించి పరిష్కరిస్తామని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు గడ్డం అనంత లక్ష్మి, కార్యదర్శి లక్ష్మీనరసమ్మ, హేమలత, కళ్యాణి, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఒడి'తో వైసిపి పాలనలో ఆనందం

పుస్తకం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి ప్రభుత్వంలోనే అమ్మఒడి కింద రాష్ట్రంలో తల్లులు ఎంతో సంతోషంగా ఉన్నారని, కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల తల్లి దండ్రులు ఎవరు సంతోషంగా లేరని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రజలకు జగన్ అంటే నమ్మకం ఉందని, చంద్రబాబు అంటే మోసమనే విషయం ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి 87 లక్షల మంది తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేశామని, కూటమి ప్రభుత్వంలో 50 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి హరిబాబు, కొక్కిలిగడ్డ చెంచయ్య, యర్రయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు : వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పావులూరు 'జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం' పుస్తక ఆవిష్కరణ సోమవారం చేశారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కాకముందు ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో విఫలం అయ్యారని అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి చూపారని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ చిన్ని పూర్ణరావు, చినగంజాం కన్వీనర్ నాగేశ్వరరెడ్డి , మార్టూరు కన్వీనర్ జంపాణి వీరయ్య చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకర్, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ హాయాషా బుడే, హరి రామిరెడ్డి, చౌదరి, కోటి శ్రీరాములు పాల్గొన్నారు.

పావులూరులో పుస్తకావిష్కరణ చేస్తున్న వైసిపి నాయకులు

వ్యవసాయ అధికారుల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎఒ బ్రహ్మారెడ్డి

నూతన వ్యవసాయ అధికారిగా బ్రహ్మారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదలీల్లో భాగంగా పల్నాడు జిల్లా రెంటచింతల నుండి భట్టిప్రోలుకు వచ్చారు. ఆయనకు విఎఎలు, సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రత్నరాజు, రజిని, మైత్రేయి, నాగ రమేష్ ఉన్నారు.

ఎఒ ప్రేమ్ సాగర్

వేమూరు : నూతన వ్యవసాయ అధికారిగా ప్రేమ సాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బాధల్లో భాగంగా తెనాలి నుండి వేమూరుకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ చేసిన సిహెచ్ సునీత గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు బదిలీ అయ్యారు.

ఎఒ నరేంద్రబాబు

కొల్లూరు : వ్యవసాయ అధికారి వి నరేంద్రబాబు సోమవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన నరసరావుపేట నుండి కొల్లూరుకు బదిలీ కాగా ఇక్కడ పనిచేసిన ఆర్ వెంకటేశ్వరరావు బదిలీపై పొన్నూరు వెళ్లారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ మండలంలో అర్హులైన రైతులు అన్నదాత సుఖీభవకు సంబంధించి రైతు సేవా కేంద్రంలో ఇకెవైసి చేయించుకోలని సూచించారు.

ఎఒ ఎండి ఫరూఖ్

చెరుకుపల్లి : మండల వ్యవసాయ అధికారిగా ఎండి ఫరూఖ్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా ముండ్లమూరు ఎఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన టి బాలాజీ గంగాధర్ బదిలీపై పల్నాడు జిల్లా వెల్దుర్తి వెళ్లారు. ఎఇఒ బిడి రామకృష్ణ పదవి బాధ్యతలు స్వీకరించారు. జూన్ 18లోగా ఈకెవైసిలను పూర్తి చేయాలని ఆదేశించారు.

రేపల్లె : వ్యవసాయ అధికారిగా అవ్వారు మహేష్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నుండి బదిలీపై వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవకు సంబంధించి ఎన్రోల్మెంట్ జరుగుతుందని చెప్పారు. మంగళవారం నుండి వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం చేయనట్లు చెప్పారు. రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంతమాగులూరు : వ్యవసాయ అదికారిగా షేక్ సైదా సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా కొండాపురం నుండి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎఒగా పనిచేసిన లావణ్య మార్టూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా షేక్ సైదాకు రైతు సేవా కేంద్రాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

యోగా చేస్తున్న పోలీస్ సిబ్బంది

యోగా చేయడం ద్వారా ఆరోగ్యం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపం ఆవరణలో పోలీసు సిబ్బందికి యోగా మాస్టర్ ట్రైనర్, ఉప్పుటూరి హెూమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్ర శేఖర్ నేతృత్వంలో సోమవారం యోగా శిక్షణ నిర్వహించారు. నిత్య ఆరోగ్యం నిత్య యోగతోనే సాధ్యమని తెలిపారు . రోజు 40 నిమిషాలు యోగా చేయడం ద్వారా 70శాతం వ్యాధుల నుండి విముక్తి పొందవచ్చని పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రభుత్వ కార్యాలయం, గ్రామాల్లో నిర్దేశించిన 10 యోగ వేదికల వద్ద జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్య వంతులుగా మారాలని కోరారు. యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. స్వాసపై ధ్యాస ఉంచడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాల్యాద్రి మాట్లాడుతూ మన డాక్టర్ ఎంతో ఓపికతో, చక్కగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు సిబ్బందికి యోగ శిక్షణ ఇవ్వడం తనకి ఎంతగానో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు.

పోస్టాఫీసు వద్ద బారులు తీరిన మహిళలు

నగదు కోసం మహిళల క్యూ..

ప్రజాశక్తి - అద్దంకి

తల్లికి వందనం పథకం కింద విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేసింది. స్థానిక పోస్టు ఆఫీసు ప్రాంతీయ కార్యాలయంలో భారీ సంఖ్యలో మహిళలు నగదు ఉపసంహరణకు బారులు తీరారు. తీరా పోస్ట్ ఆఫీస్ పరిధిలో రోజుకు రూ.2లక్షల వరకు మాత్రమే నగదు ఉపసంహరణ ఉండడంతో అక్కడికి వచ్చిన మహిళలు నిరాశకు గురి అయ్యారు. వెంటనే నగదు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ గోపి మాట్లాడుతూ ఈ సమస్య గురించి ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. నగదు పెంచి ఉపసంహరణ చేసే అవకాశం వచ్చే విధంగా చర్యలు తీసుకొని మరో కౌంటర్ ఏర్పాటు చేసి మహిళలకు నగదు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పోస్టు ఆఫీస్ ఖాతాలున్న ప్రతి మహిళకు నగదు అందిస్తామన్నారు.

ప్రజాశక్తి
మంగళవారం 17 జూన్ 2025

పేదలకు ఉపయోగపడని కార్పొరేట్ ఉచిత విద్య పథకం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం పేద విద్యార్థులను కార్పొరేటు, ఇతర ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా విద్య అభ్యసించేందుకు శ్రీకారం చుట్టింది. 1వ తరగతికి పాఠశాల్లో చేరకముందే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి అర్హులైన పేద విద్యార్థులు ఆన్లైన్ ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చేరెందుకు దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఈ దరఖాస్తులను ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆన్లైన్ ద్వారా సమీక్షించి అర్హత కలిగిన వారికి ఒక కిలోమీటర్‌లోపు ఉన్న పాఠశాలలకు మొదటి ప్రాధాన్యతను ఇస్తుంది. 2వ ప్రాధాన్యతగా మూడు కిలోమీటర్ల లోపు ఉన్న పాఠశాలలకు విద్యార్థులను చేర్చుకునేందుకు సిఫారసు చేస్తుంది. దరఖాస్తులు చేసుకున్న వారి అడ్రస్ ప్రకారం వీరికి నిబంధనలకు లోబడి సీట్లు కేటాయిస్తారు. ఈ విధానం ప్రభుత్వం 2022- 23 విద్యా సంవత్సరం నుండి కొనసాగిస్తోంది. పేద విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో తమ పిల్లలు ఎలాంటి ఫీజులు లేకుండా విద్య అభ్యసిస్తారనే దృక్పథంతో తల్లిదండ్రులు ఆశపడి దరఖాస్తులు చేయించి పాఠశాలల్లో చేర్పిస్తారు. ఈ పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వమే తగిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఆర్భాటంగా నోటిఫికేషన్ విడుదల చేసి విద్యార్థులను ఎంపిక చేసి దశలవారీగా ఆయా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నప్పటికీ వారికి చెల్లించాల్సిన ఫీజులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉచితంగా విద్యా బోధన కోసం చేరిన పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారు. తగిన రీతిలో విద్యాబోధన చేయకుండా వ్యవహరిస్తుందనే ఆరోపణ వినిపిస్తున్నాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన ఉచిత ఫీజులను సకాలంలో చెల్లించకపోవడంతో యాజమాన్యాలు వీరందరినీ మిగతా పిల్లలతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఒక తరగతి గదిలోనే ఉంచి మిగతా విద్యార్థులకు భిన్నంగా అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయులను కేటాయించి బోధిస్తున్నారు.

మండల విద్యా వనరుల కేంద్రం

సాధారణంగా ఉచిత విద్య అంటే పాఠశాలల్లో ఫీజులు కట్టి చెల్లించే విద్యార్థులతో పాటు వీరిని కూడా అదే తరగతి గదిలో ఉంచి విద్యా బోధన చేయాల్సి ఉంది. దీనివలన ఉచిత విద్య పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల కంటే అధ్వానమైన తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

రెండేళ్లుగా ఉచిత విద్య ఫీజులు అందలేదు

2022 - 23 విద్యా సంవత్సరం నుండి ప్రారంభమైన ఉచిత విద్యా విధానం ద్వారా గత రెండేళ్లుగా ఎలాంటి ఫీజులు పాఠశాలలకు చెల్లించడం లేదని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వాపోతున్నారు. పాఠశాల నిర్వహణ అత్యంత కష్టగా మారిందని చెబుతున్నారు. ఉపాధ్యాయుల వేతనాలు, బస్సుల నిర్వహణ, చిన్న పిల్లలను చూసుకోవటానికి ఆయాలు తదితర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ఉచిత విద్యార్థులను పాఠశాలకు పంపిస్తుంది తప్ప బిల్లులు సకాలంలో రావటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు విడుదల చేస్తే తాము ఉత్సాహంగా విద్యాబోధన చేస్తామని అంటున్నారు. గత నాలుగేళ్లగా ప్రతి ఏటా ఉచిత విద్యా విధానం కింద విద్యార్థులను చేర్పిస్తున్నప్పటికీ ఫీజులు కొంతమేరైనా విడుదల చేస్తే తమకు ఆర్థిక భారం తగ్గుతుందని అంటున్నారు.

ఏడాది 75సీట్లకు 76దరఖాస్తు

ఈ ఏడాది 1వ తరగతిలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి మండలంలో 75సీట్లను కేటాయించగా 76మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో తొలి విడతగా 29మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. మిగిలిన వారిని 2, 3దశలుగా సీట్లు కేటాయించి 75మందిని భర్తీ చేయనున్నారు. మండలంలో ఐదు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు ఉండగా వాటిలో ఆ గ్రామాల నుండి పాఠశాలకు దూరంగా ఉన్న వారిని 29 మందిని కేటాయించారు. వీటిలో అద్దేపల్లి సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, మాత ఇంగ్లీష్ మీడియం పాఠశాల, భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, పెదలంక స్వాతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, పల్లెకోన సిఆర్ పాఠశాల ఉన్నాయి.

తల్లికి వందనంతో ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన అడ్మిషన్లు

పాఠశాలల పునః ప్రారంభంలో అడ్మిషన్లు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి తల్లిదండ్రుల అకౌంట్లో నగదు జమ చేయడంతో ఆ సొమ్ముతో విద్యార్థులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీని కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతిలో చేరాల్సిన విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు క్యూ పడుతున్నారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేయటం ఆనందదాయకం అయినప్పటికీ దాని వలన ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వమే పరోక్షంగా ప్రైవేటు పాఠశాలల బలోపేతాన్ని ప్రోత్సహించే విధంగా వ్యవహరిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా ప్రభుత్వం పేదవారికి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం కేటాయించిన ఈ పథకం ద్వారా పాఠశాలలకు బిల్లు చెల్లించి విద్యార్థుల చదువులు ప్రోత్సహించాలని కోరుతున్నారు.

'తల్లికి వందనం'తో మాతృమూర్తుల్లో ఆనందం

ప్రజాశక్తి - బాపట్ల

సలగల రాజశేఖరబాబు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం అమలుతో మాతృమూర్తుల్లో ఆనందం నింపిందని టిడిపి జిల్లా అధ్యక్షులు, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు చెప్పారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకం అమలు చేసి ఒకేసారి డబ్బులు విడుదల చేయటం చరిత్రలోనే తొలిసారి అన్నారు. గత వైసిపి ప్రభుత్వం కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మ ఒడి పథకం ద్వారా డబ్బులు అందిస్తే తమ ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం ద్వారా డబ్బు జమ చేసినట్లు తెలిపారు. తద్వారా విద్యార్థుల నాణ్యమైన విద్యకు బాటలు వేసిందన్నారు. ఒకేసారి రూ.10వేల కోట్లకుపైగా తల్లికి వందనం నిధులు విడుదల చేసి రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసిందని అన్నారు. రాష్ట్రంలో వివిధ పథకాలను అమలు చేస్తూ మెరుగైన పాలన అందిస్తుందని అన్నారు. రహదారుల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత పారదర్శక పాలన అందించడానికి సిద్ధంగా ఉందన్నారు.

గోడౌను పరిశీలిస్తున్న తహశీల్దారు రవికుమార్

పొగాకు గోడౌను పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - యద్దనపూడి

'నాణ్యత పేరుతో పొగాకు చెక్కులు సగం తెరస్కరణ' శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు తహశీల్దారు కె రవికుమార్ స్పందించారు. మండలంలోని అనంతవరం గ్రామం పరిధిలోని జిపిఐ కంపెనీ పొగాకు గోడౌను సోమవారం పరిశీలించారు. అక్కడున్న ఇన్చార్జిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతులు తెచ్చిన చెక్కులను ఎందుకు తిరస్కరిస్తున్నారని తహశీల్దారు ప్రశ్నించారు. తేమ గ్రేడింగ్ సరిగా చేయపోవడం వంటి సమస్యలున్న వాటిని తిప్పి పంపామని, అలాంటివి సరిచేసుకొని మరల తీసుకు రమ్మనట్లు గౌడవున్ ఇంచార్జ్ తహశీల్దారుకు వివరించాడు.

ఎఒగా హేమంత్ భరత్

ప్రజాశక్తి - అమృతలూరు

ఎఒ హేమంత్ భరత్

నూతన వ్యవసాయ అధికారిగా ఎం హేమంత్ భరత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా కందుకూరు సబ్ డివిజన్ వలేటివారిపాలెం నుండి సాధారణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై నెలలో రాష్ట్ర ప్రభుత్వం నుండి రైతు సోదరులకు అన్నదాత సుఖీభవ నగదు జమ కానున్నాయని తెలిపారు. అర్హుల జాబితా విఎఎ లాగిన్ నందు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అందువలన రైతులు రైతు సేవా కేంద్రంలో ఉండే విఎఎ వద్దకు ఆధార్ కార్డు తీసుకుని ఈనెల 20లోపు ఈకెవైసీ పూర్తి చేసుకోవా లని సూచించారు. ఈకెవైసి చేసుకున్న వారికి మాత్రమే అమౌంట్ జమ అవుతుందని అన్నారు. 14 రైతు సేవ కేంద్రాల పరిధిలో అన్నదాత సుఖీభవ 5713 ఉన్నారని చెప్పారు. జూలైలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు కలిపి రూ.7వేలు ఖాతాల్లో జమవుతాయని తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కుందుర్రు, పరిటాల వారిపాలెం గ్రామాల మధ్య పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో సీఐ వెంకటరావు, ఎస్ఐ పట్టాభిరామయ్య తమ సిబ్బందితో దాడి చేసి 12 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రు.2,02,500 నగదు, 8 ద్విచక్ర వాహనాలు సోమవారం స్వాధీనం చేసుకున్నారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో మందు తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన వాహన దారులను సిఐ ఆరాధ్యుల సుబ్బారాజు డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేసి కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో సోమవారం హాజరు పర్చారు. ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి పున:ప్రతిష్ట

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి పున ప్రతిష్ట సందర్భంగా వార్షిక శాంతి కళ్యాణ మహోత్సవం సోమవారం నిర్వహించారు. గోలి భార్గవ శ్రీనివాసరావు దంపతులు అభిషేకం చేయించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న అశోక్ బాబు

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన వైసిపి నాయకులు మంచాల అశోక్, సుమతి కుమారుడు మంచాల రోశయ్య, హన్నా వివాహం కు వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంపిపి జలాది రూబెన్, మాజీ జడ్పీటీసీ గాదె శివరామ కృష్ణారెడ్డి, ఉయ్యూరు రవిశంకరరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ఇకెవైసి కోసం పాట్లు

ప్రజాశక్తి- చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల కాతాల్లో నగదు జమ చేసింది. అయితే లబ్ధిదారులకు సంబంధించిన వివరాల అప్డేషన్ ఆధార్ సెంటర్లకు అనుసంధానం చేయటంతో ఆధార్ కేంద్రాల వద్ద తల్లి, దండ్రులు తమ పిల్లలతో సహా వచ్చి సోమవారం బారులు తీరారు. ఆధార్ అనుసంధానం తప్పనిసరి కావడంతో చాలా మంది తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయించుకోవడానికి, తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు. పట్టణంలోని గంజిపాలెం సచివాలయంలో ఏర్పాటు చేరిన ఆధార్ సెంటర్లో ఆధార్ అనుసంధానంకు లబ్ధిదారుల రద్దీతో కిటకిటలాడింది. అయితే ఆధార్ నిర్వాహకులు పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ సర్వర్లు సరిగ్గా పనిచేయక మొరాయిస్తున్నాయి. సంచార ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి లబ్దిదారులకు సౌకర్యం కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

యద్దనపూడి : స్థానిక సచివాలయం వద్ద గ్రామంలో తల్లికి వందనం లబ్దిదారులు క్యూకట్టారు. రైతులు రైతు భరోసా పథకంకు ఈకెవైసీ చేయించుకొనుటకు, తల్లికి వందనం పథకం తల్లిదండ్రులు ఈకేవైసీ, ఆధార్ సమస్యలు సరి చేయించుకొనుటకు వచ్చారు. దీనితో సచివాలయ ప్రాంగణం ప్రజలతో నిండిపోయింది.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని సంతమాగులూరు, పుట్టావారిపాలెం, కామేపల్లి, అడవిపాలెం, వెల్లలచెరువు, మిన్నేకల్లు, చవిటి పాలెం, గురిజేపల్లి, సజ్జాపురం, బండివారిపాలెం, కొమ్మాలపాడు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. డిఇఇ వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 31 బృందాలతో 1461 సర్వీసులను పరిశీలించారు. తనిఖీల్లో అనుమతికి మించి లోడు వినియోగిస్తున్న 112 మందికి రూ.2లక్షల వరకు రుసుం విధించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ వినియోగ దారులు తమ ప్రాంగణంలోని విద్యుత్ మీటర్లకు సరిగ్గా సీల్ ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఒకవేళ మీటర్‌కు సీల్ ఊడిపోయిన, తుప్పు పట్టి తొలగిపోయిన విద్యుత్ అధికారులకు తెలియ జేయాలని అన్నారు. మీటర్లకు సీల్ లేకపోవడం, గాట్లు పెట్టడం వంటివి గమనిస్తే విద్యుత్ సౌర్యం చేసినట్లుగా పరిగణిస్తారని తెలిపారు. అలా జరిగితే అపరాధ రుసుం విధిస్తామని, 2వ సారి పట్టుబడితే అరెస్టు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 77804 56319, 83310 24029నెంబర్లకు ఫోన్ చేయాలని అన్నారు.

సహాయం అందజేస్తున్న తహశీల్దారు నాంచారయ్య

అగ్నిప్రమాదంలో ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి - నగరం

మండలంలోని ఓకేనాపీటావారిపాలెంలో అగ్నిప్రమాదం సంభవించి నాలుగు కుటుంబాలకు సంబంధించిన రెండు ఇళ్లు, 12 ఎకరాల గడ్డివాములు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఈ ఘటనలో ధూళిపూడి వెంకటేశ్వరరావు, గోపి, అంజిబాబు, ధూళిపూడి వెంకట నాగవెంకట తేజ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు. తహశీల్దారు నాంచారయ్య ప్రభుత్వం తరపున తాత్కాలిక సహాయకంగా ప్రతి కుటుంబానికి రూ.5వేల చొప్పున నాలుగు కుటుంబాలకు అందజేశారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజా ఫిర్యాదులు

సత్వరమే పరిష్కరించండి

అధికారులకు ఎస్పీ దామోదర్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

ప్రజాఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి చట్ట పరంగా న్యాయం చేస్తామని ఎస్పీ ఎఆర్ దామోదర్ ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో వారి సమస్యలను ఎస్పీ, పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. పోలీస్ అధికారులు 65 ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎక్కువగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, జాబ్/మనీ మోసాలు, మరియు ఇతర సమస్యల గురించి ప్రజలు వినతులను ఇచ్చారు. కార్యక్రమంలో వచ్చిన ఆయా ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి పిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ధన్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి యాజమాన్యం

సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలి

ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆర్‌ఎంకు అర్జీ ఇస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రయాణికులకు ఆర్‌టిసి యాజమాన్యమే సైకిల్ స్టాండ్ నిర్వహించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నాడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సత్యనారాయణను కలిసి ఆర్‌టిసి ప్రాంగణంలో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ సైకిల్ స్టాండ్ నిర్వాహకులు కనీస ఛార్జీగా రూ.20 వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆర్‌ఎంకు వివరించారు. ఆర్టీసీలో ప్రయాణికులు వారి సైకిళ్లను ఎక్కడ పెట్టాలో అర్థం కావటం లేదన్నారు. బస్సు ఛార్జీకి మించి సైకిల్ స్టాండ్ ఛార్జీ అధికంగా ఉందన్నారు. ఉదాహరణకు సంతనూతలపాడు వెళ్లి రావడానికి మూడుగంటలు పడుతుందని, ప్రైవేట్ సైకిల్ స్టాండ్లో పెడితే ప్రస్తుతం రూ.20 మినిమం వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో షాపుల నిర్వాహకులు ఎంఆర్పి రేట్ల కంటే ఎక్కువ రేట్లకు వస్తువులను అమ్ముతున్నారని, వీటిని అరికట్టాలని, ధరలను నియంత్రించాలని కోరారు. అతి చౌకగా లభించే లోకల్ వాటర్ బాటిళ్లను బ్రాండెడ్ బాటిళ్ల ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీటన్నింటిపై చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ విషయాలపై ఆర్ఎం సానుకూలంగా స్పందించారు. తగు చర్యలు చేపట్టేందుకు హామీ ఇచ్చారు. ఆర్ఎంను కలసిన వారిలో భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య, ఒంగోలు పట్టణ అభివృద్ధి సంఘం అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, కార్యదర్శి టి భక్తసింగ్ రాజు, మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్, పౌర సమాజం కన్వీనర్ గుమ్మళ్ల నరసింహారావు, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు యంకె. బేగ్, ఒంగోలు పట్టణ అభివృద్ధి సంఘం కార్యవర్గ సభ్యులు పి బాబురావు పాల్గొన్నారు.

సచివాలయ భవనం బిల్లులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముండ్లమూరు మండలం, శంకరాపురం సచివాలయ భవనం తాలూకు మిగిలిన బిల్లులు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్ మేడికొండ శేషగిరిరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శంకరాపురంలో చేసే ఎం.జి. ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకంలో సచివాలయం బిల్డింగ్‌ను పూర్తిచేశానని తెలిపారు. తనకు గతంలో స్పెషల్ ఆఫీసర్, సర్పంచ్ కొంత బిల్లులు చెల్లించారని, తదుపరి బిల్లులు 2024 సంవత్సరం, అక్టోబరులో మొత్తం రూ.8,17,662 గ్రామ పంచాయతీ అకౌంట్‌లో జమయ్యాయని తెలిపారు. మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఈ పైకం తాలూకు ఎఫ్.టి.ఒ. ట్రాన్సాక్షన్ డిటైల్స్ తేది.30-10-2024న తనకు ఇచ్చారన్నారు. ఆ కాపీని గ్రామ పంచాయతీ సెక్రటరీకి ఇచ్చానని, కానీ ఈ రోజు వరకు తనకు గ్రామ పంచాయతీ వారు పైకం చెల్లించలేదన్నారు. తాను పై అధి కారులను కలిసి విన్నవించుకున్నప్పటికీ నేటికీ తనకు చెల్లింపులు జరగలేదన్నారు. ఎంతోమంది అధికారులకు అర్జీలిచ్చినా తనకు న్యాయం జరగలేదన్నారు. తనకు రావాల్సిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

5163 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం

ప్రశాంతంగా ముగిసిన బదిలీ ప్రక్రియ: డిఇఒ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు డిఇఒ ఎ.కిరణ్‌కుమార్ సోమవారం నాడు ప్రకటించారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా విద్యాశాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు మరియు పదోన్నతుల ప్రక్రియ పూర్తి గావించినట్లు పేర్కొన్నారు. మొత్తం జిల్లాలో 5163 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగినట్లు తెలిపారు. జిల్లాలో ప్రధానోపాధ్యాయులుగా 83 మంది, స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్)గా 26, స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) 27, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) 11, పిఎస్‌హెచ్ఎంలుగా 166, స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) నలుగురు మొత్తం 295 మందికి పదోన్నతులు దక్కాయన్నారు. కాగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు 101, మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్లు 545, స్కూల్ అసిస్టెంట్స్ మరియు తత్సమాన ఉపాధ్యాయులు 1801, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 2647, భాషా పండితులు 11, పిఇటి 27 క్రాఫ్ట్, మ్యూజిక్, ఒకేషనల్ 31 మొత్తం 5163 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగినట్లు వివరించారు. పదోన్నతులు పొందిన వారు, బదిలీ అయిన వారంతా సోమవారం నుంచి విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎంహెచ్ఒకు అర్జీ ఇస్తున్న ఫెడరేషన్ నాయకులు

మున్సిపల్ కాంట్రాక్ట్ సిబ్బందికి

సంక్షేమ పథకాలు అమలుచేయాలి

మున్సిపల్ అండ్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏ.పీ. మున్సిపల్ అండ్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. సోమవారం నాడు ఆ యూనియన్ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో ఎంహెచ్ఓ డాక్టర్ యం.వైష్ణవికి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీ విభాగంలో పనిచేస్తున్న శానిటేషన్, ఇంజనీరింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలు పొందుతూ ఆర్థిక ఇబ్బందులతో గడుపుతున్న వారికి తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్మికులను ఆప్కాస్‌లో పర్మినెంట్ ఉద్యోగులుగా ఆన్లైన్లో చూపించడం కారణంగా తల్లికి వందనం, పెన్షన్, సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి కూడా అమలు కావడం లేదని తెలిపారు.. పట్టణ కేంద్రాల్లో, కార్పొరేషన్ పరిధిలో ప్రజారోగ్యానికి ప్రజా సంరక్షణ కోసం పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కాకపోవటం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, శానిటేషన్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి.నరసింహ, టి.విజయమ్మ, నాయకులు కె.సాహ్రమణ్యం, ఆర్.శ్రీనివాసరావు, కే.గోపి, యాకోబు, వంశీ, సంతోషమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా వైసిపి

ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్యకర్తలకు వైసీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. పొదిలిలో జగన్ పర్యటన సందర్భంగా రాళ్లదాడి కేసులో అరెస్టు అయ్యి.. ఒంగోలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వైసీపీ నాయకులను, కార్యకర్తలను ములాకత్ ద్వారా సోమవారం నాడు పరామర్శించి.. వారికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. పోలీసులు దాడికి పాల్పడిన టిడిపి వారిని వదిలేసి.. వైసీపీ కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు కేసులపై చట్టప్రకారం న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ మేరుగు నాగార్జున, మార్కాపురం ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి బత్తుల బ్రహ్మానందరెడ్డి, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ వైఎం ప్రసాద రెడ్డి (బన్నీ), చీరాల వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమ్మూరి కనకరావు, చీమకుర్తి మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు, కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చినఒబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, విజయజ్యోతితో కలిసి పాల్గొని.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. నిబంధనల మేర ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారుడికి తెలియజేయాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారం ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.